క్లుప్తంగా

వేలం పాట వాయిదా

పాలసముద్రం: వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్రవాహనాలకు శనివారం జరగాల్సిన వేలం పాట వాయిదా పడినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. రెండు ద్విచక్రవాహనాలకు సోమవారం వేలం పాట జరుగుతుందన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

నింద్ర: రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని ఎస్‌ఎఫ్‌ఎంటీఎం చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని అత్తూరు, అగరం గ్రామల్లో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఖరీఫ్ సాగుకు ముందు భూసార పెంపునకు తీసుకోవాల్సిన విషయాలను వివరించారు. కార్యక్రమంలో అర్‌బీకే చైర్మన్ వీరయ్యానాయుడు తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు మార్కెట్ ఆదాయం రూ.38 లక్షలు

పుత్తూరు రూరల్: పుత్తూరు దినసరి కూరగాయల మార్కెట్, ప్రైవేటు బస్టాండ్, జంతువధశాలకు శనివారం నిర్వహించిన బహిరంగ వేలం పాట ద్వారా రూ.38.79 లక్షలు మున్సిపాలిటీకీ ఆదాయం సమకూరినట్లు కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి తెలిపారు. దినసరి కూరగాయల మార్కెట్‌ను పి.జనార్దన్ రూ.19.13 లక్షలకు దక్కించుకోగా, ప్రైవేటు బస్టాండ్‌ను ఏ.లోకనాథం రూ.14.85 లక్షలకు, జంతువధశాలను ఎస్.సుబ్రమణ్యం రూ.4.81 లక్షలకు దక్కించుకున్నట్లు వెల్లడించారు. గుత్తేదారులు మున్సిపాలిటీ నిబంధనల మేరకు రుసుం వసూలు చేయాలని స్పష్టం చేశారు.

వీఆర్వో మృతికి నివాళి


సంజీవయ్య (ఫైల్)

నింద్ర: మండలంలోని అత్తూరు గ్రామ పంచాయతీ వీఆర్వో సంజీవయ్య(50) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. రెండు వారాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. పరిస్థితి విషమించడంతో కన్నుమూశారు. ఆయన మృతదేహానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ నాగరాజు, అర్‌ఐ కళావతి, సింగిల్ విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి ఉన్నారు.

దాతకు సత్కారం

శ్రీరంగరాజపురం: మండలంలోని 49 కొత్తపల్లి మిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రార్థన వేదికను సొంత నిధులతో నిర్మించిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు రాజారెడ్డిని శనివారం ఉపాధ్యాయ బృందం సత్కరించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పారిశ్రామిక వేత్త ఫణీంద్ర విద్యార్థులకు విజయసాధన మెటీరియల్, ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

నగరి: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్స్ పరీక్షలు ఆదివారం నుంచి ప్రారంభంకానున్నాయి. మండలంలో 696 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఈ ఏడాది ఆయా కళాశాలల్లోనే ప్రాక్టికల్స్ నిర్వహించేలా ఇంటర్ బోర్డ్ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. జంబ్లింగ్ విధానం లేకపోవడం వల్ల అవకతవకలు జరిగే ఆస్కారం లేకుండా సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. జియో ట్యాగింగ్ విధానంలో రెండు సెషన్లలో ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. మొదటి స్పెల్ ఈనెల 26వ తేదీ నుంచి మార్చి 2వ తేదీ వరకు జరుగుతాయి. ఆయా పరీక్ష కేంద్రాలకు ఒక్కో చీఫ్ సూపరింటెండెంట్‌ను నియమించారు. రెండో సెషన్ మార్చి 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు జరుగుతాయి. నగరి పీసీఎన్ జూనియర్ కళాశాల, డాక్టర్ ఎంఎస్ఎంఎస్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, శ్రీసూర్య జూనియర్ కళాశాల, శ్రీవివేకానంద జూనియర్ కళాశాల సెంటర్లలో ప్రాక్టికల్స్‌లు జరగనున్నాయి. సమస్యలు ఏవైనా ఉంటే 0877-2237200 టోల్ ఫ్రీ నంబర్‌కు సంప్రదించవచ్చు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి


మాట్లాడుతున్న హార్టీకల్చర్ డీడీ

గంగాధరనెల్లూరు: మామిడి రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై మొగ్గు చూపాలని హార్టీకల్చర్ డీడీ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. గొల్లపల్లి సమీపంలోని జైన్ ఫ్యాక్టరీ ఆవరణలో శనివారం మామిడి రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీడీ మాట్లాడుతూ మామిడిపండ్లకు గతంలో విదేశాల్లో మంచి డిమాండ్ ఉండేదన్నారు. ప్రస్తుతం ఆపరిస్థితి లేదని తెలిపారు. మామిడి రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై మొగ్గు చూపాలని తెలిపారు. జామ, సపోటా, నిమ్మ, ఆరంజ్, దానిమ్మకు మంచి డిమాండ్ ఉందని, ఈపంటల సాగుపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. రైతులందరూ మామిడి తోటలపై మొగ్గు చూపడంతో ఉత్పత్తి పెరిగి డిమాండ్ తగ్గుతోందన్నారు. మామిడి దిగుబడి కోసం ఎక్కువ ఖర్చు పెట్టాల్సి వస్తోందని తెలిపారు. దీంతో రైతులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. మామిడి తోటల పెంపకంలో ఆధునిక పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జైన్‌ఫ్యాక్టరీ మేనేజర్ షమీర్‌శర్మ, మామిడి రైతుల సంఘం జిల్లా కార్యదర్శి గోవర్ధన్ బాబీ, డాక్టర్ ప్రసాద్, వీఎస్‌రావు, నేచర్ ఫుడ్స్ యజమాని బాబురెడ్డి, చంద్రకుమార్ పాల్గొన్నారు.

అమ్మా.. ఎక్కడికెళ్లావు!



రోడ్డుపై బైటాయించి నిరసన వ్యక్తం చేస్తున్న పద్మసరస్సు ఎస్టీకాలనీ వాసులు, బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

- రోడ్డు ప్రమాదంలో తల్లిని పోగొట్టుకున్న చిన్నారులు
- సునీత కుటుంబానికి న్యాయం చేయాలని చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై గ్రామస్తుల బైటాయింపు
- మృతుడి కుటుంబానికి రూ.5 లక్షలు
- గాయపడిన వ్యక్తికి రూ.2.5 లక్షలు
- ప్రకటించిన డిప్యూటీ సీఎం నారాయణస్వామి


సునీత పిల్లలు, మృతి చెందిన సునీత (ఫైల్)

కార్వేటినగరం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సునీత కుటుంబానికి న్యాయం చేయాలని.. నిందితులను కఠినంగా శిక్షించాలని పద్మ సరస్సు ఎస్టీ కాలనీవాసులు శనివారం చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై బైటాయించి ఆందోళన చేశారు. ''మా అమ్మ ఎక్కడ..? మాకు అమ్మ కావాలి అంటూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సునీతా కుమార్తె వైష్ణవి(7), కుమారుడు రేష్మంత్(5) వెక్కివెక్కి ఏడవడం అక్కడి వారిని కంటతడి పెట్టించింది. అభం, శుభం తెలియని చిన్నారులు అమాయకంగా నిరసనలో ప్లకార్డు పట్టుకుని కనిపించారు. చిన్నారులకు సమాధానం చెప్పలేక బంధువులు అమ్మ వస్తుందని సర్ది చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్లే సునీత (25) మృతి చెందిందని, ఉదయ్‌కిరణ్(27) తీవ్రంగా గాయపడ్డాడని ఆరోపించారు. అతనితో పాటు నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్న టిప్పర్ యజమానిని అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి, నగరి డీఎస్పీ రవికుమార్, సీఐలు చంద్రశేఖర్, రాజశేఖర్, ఎస్‌ఐ దస్తగిరి సంఘటనా స్థలానికి వెళ్లి వారితో మాట్లాడారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

అసలేం జరిగిందంటే..

కార్వేటినగరం పంచాయతీ పద్మసరస్సు ఎస్టీకాలనీకి చెందిన ఉదయకుమార్(27) కుటుంబ సభ్యులతో కలసి సొంత పనుల నిమిత్తం కార్వేటినగరం గ్రామానికి చేరుకుని గాండ్లమిట్ట కూడలి వద్ద ద్విచక్రవాహనంపై నిలుచుని ఉండగా పచ్చికాపల్లం నుంచి చిప్స్ లోడ్డుతో వస్తున్న టిప్పర్ రెండు ద్విచక్రవాహనాలను, ఆ పక్కనే ఉన్న కార్లను ఢీకొట్టింది. ద్విచక్ర వాహనంపై ఉన్న సునీత(22) రుయాలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందింది. ఉదయ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. టిప్పర్‌ను ఆపినా డ్రైవర్ వెళ్లడంతో యువకులు ద్విచక్రవాహనంలో వెంబడించి అడ్డుకున్నారు.

సీఎం దృష్టికి తీసుకెళ్లాం

ఈ ఘటనను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి సునీత కుటుంబానికి రూ.5 లక్షలు, గాయపడిన ఉదయ్‌కుమార్‌కు రూ.2.5 లక్షలు ప్రకటించారు. లారీ డ్రైవర్ లైసెన్సు రద్దు చేయాలని ఆదేశించాం. తక్షణ సాయంగా బాధిత కుటుంబానికి రూ. 25 వేలు అందించాం.

–నారాయణస్వామి, డిప్యూటీ సీఎం

తిరుచ్చిపై ప్రసన్నుడి వైభవం


తిరుచ్చిపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

వడమాలపేట: అప్పలాయగంట శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం తిరుచ్చి గ్రామోత్సవం, ఊంజలసేవ వైభవంగా జరిగింది. వేకువ జామున సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి, తోమాలసేవ, నిత్యకైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను పట్టుపీతాంబరాలు, విశేష ఆభరణాలు, పరిమళభరిత పుష్ప మాలికలతో సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చారు. వేదమంత్రాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ ఊంజలసేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకారభూషితడైన శ్రీపద్మావతి, ఆండాల్ సమేతంగా ప్రసన్న వేంకటేశ్వర స్వామిని మంగళవాయిద్యాలు నడుమ తిరువీధుల్లో ఊరేగించారు. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై రేపు సమావేశం

పుత్తూరు రూరల్: వైఎస్సార్‌సీపీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డికి మద్దతుగా పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా ఆధ్వర్యంలో సోమవారం నగరి నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు మంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. పుత్తూరు రూరల్ మండలం పరమేశ్వర మంగళం సమీపంలోని జీవీఆర్ కల్యాణ మండపంలో సోమవారం ఉదయం 10 గంటలకు సమావేశం జరుగుతుందని పేర్కొంది. నియోజకవర్గంలోని మున్సిపాలిటీలు, అన్ని మండలాల నుంచి వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, హాజరుకావాలని కోరారు.

ఆక్రమిత భూములపై టీడీపీ నేత రాద్ధాంతం

- పేదలకు పట్టాలుగా ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ నేతల డిమాండ్


ఆక్రమణకు గురైన భూమి

నగరి: మున్సిపల్ పరిధిలోని కేవీపీఆర్‌పేటలో ఆక్రమిత భూములపై టీడీపీ నేతలు రాద్ధాంతం సృష్టించారు. వివరాల్లోకి వెళితే.. పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ఇంటి పట్టాలు ఇవ్వడానికి రెవెన్యూ సర్వేయర్ సూచించన మేరకు కేవీపీఆర్‌పేటలోని నది పొరంబోకు స్థలం సర్వే నెంబర్ 275లోని ఎ80.9 ఎకరాల స్థలాన్ని జేసీబీతో చదును చేయడానికి 17వ వార్డు కౌన్సిలర్ కుమారుడు మురుగ, 24వ వార్డు కౌన్సిలర్ మోహన్‌రాజ్, 16వ వార్డు కౌన్సిలర్ గంగాధరం వెళ్లారు. జేసీబీతో పనులు ప్రారంభించే సమయంలో ఆ వార్డుకు చెందిన టీడీపీ నాయకుడు శ్రీనివాసన్ అవి తనకు చెందిన భూములంటూ వారికి అడ్డుపడ్డాడు. తన స్వాధీనంలో ఉన్న భూములపై మీ పెత్తనమేంటని ఆగ్రహం వ్యక్తం చేస్తూ జేసీబీ డ్రైవర్‌ను మందలించాడు. దీంతో అక్కడే ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులకు, టీడీపీ నేతకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీనిపై వైఎస్సార్‌సీపీ నాయకులు సమాధానమిస్తూ టీడీపీ నాయకుల ఆక్రమణలు బహిర్గతమతోందన్నారు. రికార్డుల్లో 275 అనే సర్వేనెంబరు నది పొరంబోకు ప్రభుత్వ భూమి అని స్పష్టంగా ఉన్నా అది తన భూములంటూ టీడీపీ నేత వాదించడంలోనే ఆయన ఆక్రమించుకున్నట్లు స్పష్టమైందన్నారు. ఆర్డీఓ సమక్షంలో తహసీల్దార్, సర్వేయర్ ద్వారా భూములను సర్వేచేసి ఎంత భూమి ఆక్రమణకు గురైందో గుర్తించి స్వాధీనం చేసుకుని స్థానికంగా ఇల్లు లేని పేదలకు పట్టాలిప్పిస్తామన్నారు.

కళాఖండాలకు నిలయం కార్వేటినగరం

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నరేంద్ర


కృష్ణస్వామిరాజును సన్మానిస్తున్న అధ్యాపకులు

కార్వేటినగరం: చారిత్రక కళాఖండాలకు నిలయం కార్వేటినగరం అని ప్రముఖ కవి, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత మధురాంతకం నరేంద్ర అన్నారు. శనివారం జిల్లా విద్యాశిక్షణా సంస్థ(డైట్)లో చిత్తూరు జిల్లాకు చెందిన ప్రముఖ రచయిత ఆర్‌సీ కృష్ణస్వామిరాజు రచించిన కార్వేటినగరం కథలు, బాలల కథల పుస్తకాన్ని డైట్ ప్రిన్సిపల్ శ్రీరాం పురుషోత్తం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరేంద్ర మాట్లాడుతూ.. అందరికి మంచిని నేర్పే చక్కటి కథ, రచనలను అందిస్తున్న రచయిత కృష్ణస్వామి సేవలు అభినందనీయమని, వారి రచనలను డైట్ కళాశాలలో ఆవిష్కరించడం ఛాత్రోపాధ్యాయులకు గొప్ప ప్రేరణ కలుగుతుందని పేర్కొన్నారు. పుస్తక సమీక్ష నిర్వహించిన రచయిత హరికిషన్ మాట్లాడుతూ.. ప్రతి ఉపాధ్యాయుడు కనీసం పది కథలు నేర్చుకోగలిగితే విద్యార్థుల హృదాలయలను గెలుచుకోగలుగుతారని చెప్పారు. పుస్తక రచయిత కృష్ణస్వామిరాజు మాట్లాడుతూ.. చిన్నతనం నుంచి తనకు ఎదురైన అనుభవాల ఆధారంగా ఇప్పటి వరకు 11 కథా సంపుటలను వెలువరించినట్లు తెలిపారు. ఆకాశవాణి విశ్రాంతి అధికారి ఆకుల మల్లేశ్వరరావు, భాస్కర్‌రాజు, అరుణాచలంరెడ్డి, అధ్యాపకులు చెంగల్‌రాజు, గాజుల నాగేశ్వరరావు, కిరణ్, రచయిత ప్రకాష్, నాగరాజునాయక్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

వడమాలపేట: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని రాష్ట్ర హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మిషా తెలిపారు. శనివారం హౌసింగ్ డేలో భాగంగా మండలంలోని కాయం రెవెన్యూలోని జగనన్న కాలనీ నిర్మాణాలను పరిశీలించారు. అర్హులైన పేదలందరికీ ఇంటి పట్టాలు, ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం మండల అధికారులు, ఇంజినీరింగ్ సహాయకులు, హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇంకా నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులతో మాట్లాడి, త్వరగా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉగాది లోపు అన్ని ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించాలని తెలిపారు. ఎంపీడీఓ అరుణ, తహసీల్దార్ సుబ్రమణ్యం, హసింగ్ డీఈలు శ్రీనివాసరావు, చంద్రశేఖర్‌బాబు, పీడీ వెంకటేశ్వరావు, ఏఈ వెంకటరత్నం పాల్గొన్నారు.

ఉగాదికి గృహప్రవేశాలు జరగాలి

పుత్తూరు రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి కాంట్రాక్టర్లను ఆదేశించారు. శనివారం పుత్తూరు మున్సిపాలిటిలోని కళ్యాణపురం, నందిమంగళం లేఅవుట్స్‌లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరుపై లబ్ధిదారులను ప్రశ్నించారు. మౌళిక సదుపాయాలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలిపారు. పనులను నాణ్యతతో వేగంగా చేయాలని గుత్తేదారులను ఆదేశించారు. ఉగాది పండుగకు గృహ ప్రవేశాలు చేసే లక్ష్యంతో పనులు జరగాలని సూచించారు.

వాహనాల వేలం రేపు

పుత్తూరు రూరల్: వివిధ కేసుల్లో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలను ఈనెల 27వ తేదీ పుత్తూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) కార్యాలయంలో బహిరంగ వేలం వేయనున్నట్లు సీఐ ఎస్.కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు వేలం ప్రారంభమవుతుందని, ఆసక్తి గల వారు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన

నగరి: మున్సిపల్ పరిధిలోని చింతలపట్టెడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల నైపుణ్యతను ఎంఈఓ శ్రీదేవి పరిశీలించారు. శనివారం పాఠశాలకు వెళ్లిన ఆమె 1, 2వ తరగతులకు ప్రభుత్వం అందించిన టీఎల్ఎం మెటీరియల్‌ను విద్యార్థులు ఏ విధంగా అర్థం చేసుకుంటున్నారో ప్రశ్నలు అడిగారు. 90 శాతం విద్యార్థులు వాటికి చక్కగా సమాధానం చెప్పడంతో ఉపాధ్యాయులను ప్రశంసించారు. మధ్యాహ్న భోజనం, రికార్డుల నిర్వహణలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

గృహసారథులే రథసారథులు


పాలసముద్రం: మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

- పార్టీ విజయానికి కీలక భూమిక పోషించాలి
- ఇది జగనన్న సైన్యం
- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి దిశానిర్దేశం


వెదురుకుప్పం: హాజరైన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు

వెదురుకుప్పం: ''ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు మరింత చేరువ కావాలి.. ప్రజలతో మమేకమై వారి కష్టాల్లో పాలుపంచుకోవాలి.. ప్రజలందరికీ మరింత మంచి జరగాలన్న ఆకాంక్షతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల నియామకానికి శ్రీకారం చుట్టారని'' ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. శనివారం ఉదయం వెదురుకుప్పంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఉప ముఖ్యమంత్రి వారికి దిశానిర్దేశం చేశారు. సీఎం జగనన్న ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో గృహసారథులు కీలక పాత్ర పోషించాలన్నారు. ప్రజలు ప్రభుత్వం నుంచి ఇంకా ఏమైనా ఆశిస్తున్నారా.. గత ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా చేసిన మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. అందరినీ సమన్వయం చేసుకుని పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. గృహసారథులే పార్టీ రథసారథులని.. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి వేసే తొలి అడుగు మీతోనే ప్రారంభం అవుతుందని స్పష్టం చేశారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు భవిష్యత్తులో పార్టీ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. విభేదాలు ఉన్నా పక్కనపెట్టి కలసికట్టుగా పనిచేయాలని నాయకులకు సూచించారు.

శ్యామ్‌ప్రసాద్‌ను ఆశీర్వదించాలి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని అందరూ ఆశీర్వదించాలని మంత్రి కోరారు. గ్రామాల్లో పట్టభద్రులను కలుసుకుని మొదటి ప్రాధాన్యతా ఓటును శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి వేయించి అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు వెంకటరమణారెడ్డి, సాయికిషోర్, జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, నాయకులు బండి గోవర్ధన్‌రెడ్డి, బట్టి సుబ్రమణ్యం, ప్రకాష్, పద్మనాభరెడ్డి, నారాయణ రెడ్డి, రామయ్య, పేట ధనంజయరెడ్డి. శివాజి, లోకనాథరెడ్డి పాల్గొన్నారు.

హామీలను 98 శాతం నెరవేర్చాం

పాలసముద్రం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చామని నారాయణస్వామి అన్నారు. సింహరాజుపురంలో జరిగిన సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నవరాత్నాల ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరవేశామన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, వైఎస్ ఎంపీపీ శేఖర్‌యాదవ్, సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, నాయకులు ఎస్ శివప్రకాష్ రాజు, తులసి, ఇందిరమ్మ, గోవిందరాజులు, గాలి మహేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నివాళి

కార్వేటినగరం: మండల పరిధిలోని గొల్లకండిగ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకురాలు వి.మనోరమ్మ(72) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణ స్వామి ఆమె స్వగృహానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. మంత్రి వెంట సర్పంచ్ వెంకటేష్, సురేష్‌బాబురెడ్డి ఉన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు


టైర్లు ఊడి కిందపడ్డ ట్రాక్టర్ ట్రాలీ

నగరి: మండలంలోని ఎం.కొత్తూరు గ్రామం వద్ద శనివారం వేకువజామున ట్రాక్టర్‌ను కారు వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో కారు రోడ్డు పక్కనే ఉన్న చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ట్రాక్టర్ ట్రాలీ నుంచి టైర్లు విడిపోయాయి. ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.